సింగరేణికథలు - 4

# "విజయం మనదే"

కార్మిక

సాయంకాలపు సందడిలో మార్కెటు కిటకిటలాడుతున్నది. ఆ సందడిలో జారి పోతున్న లాగును మొలత్రాడు కిందికిదోపి, తొమ్మిదేళ్ల నల్లటికుర్రాడు అంతవరకు సంకలోఉన్న కరపత్రాలనుతీసి కనిపించిన మనిషికల్లా యిస్తున్నాడు.

సింగరేణి కార్మిక సమాఖ్యవాళ్ళువేసిన 'కార్మికులారా విజయం మనదే'అన్న ఆ కొత్తకరపత్రాన్ని కార్మికులు ఆప్యాయంగా అందుకొని గుంపులు గుంపులుగాచేరి చదువుకొంటున్నారు- దానిమీద ఎక్కడిగుంపు అక్కడేచేరి చర్చించుకుంటున్నారు.

ఆ సందడిచూస్తుంటే పోలీసులకు పిచ్చెత్తిపోతున్నది- ఎన్ని అరెస్టులుచేసినా ఎంత నిర్బంధముపెట్టినా స్ట్రైక్‌ను ఫెయిల్ చేయలేకపోగా కనీసము నాయకులు అనుకునే వారినైనా అరెస్టు చేయలేకపోయామని పై ఆఫీసర్లకు మంటగాఉంది. కార్మికుల పై పెట్టిన మస్టర్ల కోతచట్టాన్ని విరమించుకుంటూ, కార్మిక సమస్యలను ఒప్పుకుంటూ ప్రభుత్వముచేసుకున్న ఒప్పందాన్ని కార్మికులవిజయంగా చెప్పుతున్న 'కార్మికసమాఖ్య కరపత్రాలుచూసి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మండిపడిపోతూ "కరపత్రాలుపంచె లంజ కొడుకుల్ని పట్టుకరాండ్లీ బొక్కలేసి సున్నసున్నపొద్దాం"అని ఆర్డరేసిండు.

కాని ఏంప్రయోజనం? ఎక్కడ ముఖ్యులైనవారిని ఒక్కరినికూడ అరెస్టుచేయ లేక పోయారు.

అంతభయంలోకూడ కరపత్రాలు పంచబడుతున్నాయి.

సివిల్‌డ్రెస్‌లోఉన్న పోలీసుల నక్కచూపులు మనిషి మనిషిని గుచ్చి గుచ్చి చూస్తున్నాయి.

నల్లటి కుర్రాడింకా కరపత్రాలు పంచుతూవేఉన్నాడు. సివిల్‌డ్రెస్ పోలీసోడి నక్కచూపులకు చిక్కుతున్న ఆ కుర్రాణ్ని పట్టుకొని కుడిచేత్తో ఒక్కసనుపు చరిచిండు. ఈ హటాత్ పరిణామాన్ని ఊహించని కుర్రాడు చేతిలోని కరపత్రాలు విసురుగా వదిలిండు- బొక్కబోర్లపడి పెదవి కసుకున్నాడు- కారేనెత్తురును అంగితోఅద్దుకొని ఏడ్పులంకించుకున్నాడు.

కరపత్రాలను గాలే పంచిపెడుతున్నది.

ఏడుస్తున్న పొల్లగానిచుట్టు పోలీసులు గుమికూడిండ్లు- దూరంగాఉన్న కార్మికులు దగ్గర దగ్గరగా వస్తున్నారు, బొమలుముడేసుకొని.

"ఎక్కడియిరా ఈ కరపత్రాలు" పోలీసాయన పొల్లవాన్ని గల్లపట్టి లేపుతు అడిగిండు.

"ఎవరో ఒకాయిన యిచ్చిండు.... పిప్పరమెంట్లుయిస్తా యిది పంచుతావా అంటె సరేఅన్నా" సన్నగాఏడుస్తూనే జవాబిచ్చిండు.

"ఎవడ్రావాడు సరిగాచెప్పురా లంజ...." లాటీతో పిర్రలమీద ఒక్కటేసిండు.

పిల్లగానిఏడ్పు ఎక్కువైంది- 'ఎవరో ఆయన నాకుతెల్వదు. గాచెట్టుకింద యిచ్చి ఎటోపోయిండు'.

పోలీసాయన ఇంకోరెండు అంటించిండు.

ఏడుపు తారస్థాయి అందుకున్నది.

చుట్టుగుమికూడిన కార్మికులు నోరిప్పారు- "గా పొల్లగాన్ని ఏంకొడ్తానవు.... పొల్లగానికి ఏంఎరుక ఏదో సంబరానికి పంచిఉంటడు-" తెల్లవెంట్రుకల ముసలోడు మందిలకేలి ముందుకొచ్చి అన్నడు.

పోలీసోడు ముసలివానికేసి మింగేసేలా చూసిండు.

'పోనియి- గా పొల్లగానికి ఏం ఎరక' యింకెవలో ఎనుకనుంచి అన్నడు మందిలకేలి.

'జానేదేవో బై'

పోలీసాయన పొల్లగాన్ని వదలిండు.

సన్నగాఏడుస్తూనే ఉన్నాడు పిల్లడింకా 'పోరాపొల్లగా' జనం మాట్లాడుతాండ్లు.

పోలీసోనికి ఎటుతోచలె 'ఇంకోసారి ఇటువంటి పనిచేసేదుంటే మక్కెలిర్గ దంతా పో....' గదమాయించిండు.

పోలీసోల్ల చేతులనుండి బయటపడి మర్రి మర్రి చూసుకుంటా పగిలిన పెదవిని అంగికి అద్దుకుంట, వాచిన చెంపను చేత్తోతుడుచుకుంట.... ఎక్కి ఎక్కి ఏడుస్తు మార్కెటుదాటి కార్మికుల గుడిసెల్లో కల్సిండు.

గుడిసెల్లో అడుగుపెట్టినోడు ఏడుపుబందుపెట్టి పరుగు మొదలుపెట్టి అలా చిన్న సన్న సందులుదాటి గుదిగుచ్చినట్టున్న గుడిసెల్లో మాయమయిండు.

గుడిసెల్లో ఓ గుడిసెముందాగి అటుయిటు చూసిండు. ఎవరులేరని నిర్ధారించుకొని గుడిసెతలుపు తట్టిండు.

తలుపు తెరుచుకుంది.

'ఏమైంది సత్యం। అప్పుడె కరపత్రాలన్నీ పంచావా' పరీక్షగా చూస్తూ అడిగిండతను.

'కొద్దిగన్ని ఉన్నాయనంగా పోలీసోడు గుంజుకున్నడు యింకేమన్నా ఉన్నయా నీల్లటాంకుకెల్లి పంచివస్తా....' ఉత్సాహంగా పలికిండు సత్యం.

గుడ్డిదీపపు వెలుగులో కూడ కందిపోయిన చెంపను, పగిలిన పెదవిని చూసిండ తను .. పరిస్థితి అర్థమైయింది- అయినా అడిగాడు.

"దెబ్బలెలా తగిలాయి"

'పోలీసోడు కొట్టిండు'. సూటిగాచూస్తూ జవాబిచ్చిండు సత్యం. యిది మామూలే అన్న ధోరణిలో అతని బుర్రలో వేడి. ఆలోచనలు 'సత్యం తండ్రిని అరెష్టుచేసి వారం రోజులైన యింతవరకు అచూకీలేదు. తల్లి రోగిష్ఠి మంచంలో పడిఉంది... యిప్పుడే కుర్రాడు-' చప్పున అతను ఆకుర్రాన్ని చేతుల్లోకి తీసుకొని ప్రేమగా చేయినొక్కాడు.

ఈ సంఘటనకు కుర్రాడు కాస్త సిగ్గుపడిపోయాడు.

అంతలోకే తలుపుతెరుచుకుని వెంకటయ్య వచ్చిండు. దీపపువెలుగులో అగు పించిన దృశ్యముచూసి "కామ్రేడ్స్। ఏదో మంచిఖుషిలో ఉన్నట్టుందే" పరిచయ పూర్వకంగా అన్నాడు.

"మన బుల్లికామ్రేడ్ సాహసానికి."

జరిగింది చెప్పాడతను.

అందరు సంతోషంగా మరోనిముషం నవ్వుకున్నారు- సత్యం సాహసానికి.

"కామ్రేడ్ సత్యం। యింక నీవు సెలవుతీసుకో- రేపు మల్లికలుద్దాం" లాల్ సలామ్ పలికాడతను- అతనిపేరు రాయమల్లు.

చిన్నచెయిని బిగించి తిరిగి లాల్‌సలామ్‌పలికి వెళ్ళిపోయాడు సత్యం.

వెంకటయ్య చెప్పాడు "కామ్రేడ్ సమ్మె విఫలంచెయ్యాలని ప్రయత్నించిన మేనేజ్‌మెంటు విఫలంచేయలేక మన సమస్యలను ఒప్పుకుంట, మనసమ్మెను మొదటినుండి వ్యతిరేకించిన యూనియన్‌వాళ్ళతో ఒప్పందంచేసుకుంది- దీంతో చాలమంది కార్మికుల్లో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఈ ఒప్పందంవెనుకఉన్న మేనేజ్‌మెంటు, ప్రభుత్వము ట్రేడ్‌యూనియన్ కుట్రను బహిర్గతం చేయాల్సిఉంది"

"అవును ఈ పరిస్థితిలో వాస్తవాలు తెలియచెప్పేందుకు మనమేసిన కరపత్రం ఒక్కటేసరిపోదు- బహిరంగంగా మనకు మీటింగ్‌పెట్టే అవకాశములేదు- అయినా కార్మికులకు వాస్తవాలేమిటో తెలియచెప్పాలి...." రాయమల్లు.

"అందుకే నేను ఒకటి అనుకుంటున్నాను... మనమే కార్మికుల గుడిసెల్లో వాళ్లను పోగుచేసి ఎక్కడికి అక్కడ గుడిసెల్లో వీధిమీటింగ్‌పెట్టి చెపుతేసరి" వెంకటయ్య.

"అవును అంతకంటే వేరేమార్గములేదు"

"ఆ ఏర్పాటుకూడ మన మిత్రులకు చెప్పిఉంచాను- మీరు త్వరగా బయలు దేరితే మనమిప్పుడే మన కార్యక్రమాన్ని మొదలుపెట్టవచ్చు" వెంకటయ్య.

"అయితే పద"

ఇద్దరు బయలుదేరారు.

X X X X X X

అప్పటికే చీకటి అలుముకొన్నది- కార్మికులు నివసించే గుడిసెలప్రాంతం చాలయిరుకుగా ఒకగుడిసెనానుకొని యింకోగుడిసె యిలా మొత్తము ఆ ప్రాంతమంతా అల్లుకొనిఉన్నాయి- ఆ చీకట్లో కార్మికవాడ మరీచీకటిగా కనిపిస్తున్నది. అక్కడక్కడ మిణుగురు పురుగుల్లాంటి దీపపుబుడ్డీలకాంతి ఆచీకట్లో మనుషులజాడ తెలుపుతున్నది.

వాడలోని యిరుకైన సందులగుండా నడిచిపోతే కాస్త విశాలమైన స్థలము కనిపిస్తుంది- అక్కడ గుమికూడిన కార్మికులచేతుల్లో కరపత్రాలున్నాయి- కాని ఆ చీకట్లో చదవటం కుదురటంలేదు- పక్కగుడిసెనుండి తెచ్చిన దీపపువెలుగులో యువ కార్మికుడొకడు గట్టిగా చదువుతుంటె చాలమంది వింటున్నారు- చదవటం అయిపోయిన తరువాత అంతవరకు అందరిలోనూఉన్న ఆందోళన, ఉత్సాహం ఒక్కసారిగా మాటల్లోకిమారి వాళ్ళలోవారే వాదులాడుకొంటున్నారు.

"యివ్వాల బాయిమీన్కిపోతే పోలీసోల్లున్నరు. బాయికాడ్కి వచ్చినోల్లను వచ్చినట్టే బాయిలదిగుండ్లని బలవంతం పెట్టిండ్లు- సమ్మె విరమించిండ్లు. బాయిలు నడుస్తానయంటాండ్లు. అంతలోకె హాల్లరు నడిపిస్తాండ్లు ఎవలో- కాని దీన్లఏదోమోస ముందని మావోళ్ళందరుకల్సి మాట్లాడుకున్నంక దిగుతము. అంతవరదాన్క దిగేదిలేదని ఎల్లివచ్చినము" ఆరోజు బాయిమీద జర్గిన సంఘటన చెప్పుకొచ్చిండు వీరేశం.

"హాల్లరు కంపినివాళ్ళె నడిపిండ్లు- బాయిలు నడుస్తానయి అని నమ్మించడం కోసము వాళ్ళు అట్లచేసిండ్లు" అసలు విషయం బయటపెట్టిండు విఠల్.

"యూనియనోళ్ళ మాటలు నమ్మెతట్టులేదు. ఓసారి చట్టమే పోదనిరి, సుప్రీం కోర్టులపెట్టి కొట్లాడాలనిరి. యిప్పుడు మేమేకొట్లాడి చట్టం తీసేయించినమంటాండ్లు" యూనియన్ వాళ్ళమాటలు అర్థంగాని పోశాలు అన్నడు.

"యూనియవోళ్ళ మాటలంతే.... అంతా బోగమోళ్ళతంతు ఏరోటికాడిపాట ఆరోటికాడ పాడుతరు" చలపతి.

యిలా కార్మికులు ఎవరికితోసింది వాళ్ళు మాట్లాడుకొంటున్నారు. కానిఅందరు ఆత్రంగా ఎవరికోసమో చూస్తున్నట్లుగా ఉన్నది.

అంతలోకి వెంకటయ్య, రాయమల్లు అక్కడికి వచ్చిండ్లు.

వెంకటయ్య అందరి ముందుకొచ్చి "మీటింగ్ మొదలవుతుంది. నిశ్శబ్దంగా ఉండండి" అన్నాడు. అక్కడ గుమిగూడిన కార్మికులంతా ఒకక్షణం నిశ్శబ్దమయ్యారు రాయమల్లు కొద్దిగా ముందుకొచ్చి అందరిని పరీక్షగా ఒక్కసారిచూచి తన ఉపన్యాసాన్ని మొదలుపెట్టాడు.

"కామ్రేడ్స్ చరిత్రాత్మకమైన సింగరేణిసమ్మెను ఎన్నో కష్టనష్టాలకుఓర్చి రెండునెలలు కొనసాగించి విజయం సాధించాము. అయితే మన సంఘటిత శక్తిముందు అటు మేనేజుమెంటు, ప్రభుత్వం యిటు ముప్పయి సంవత్సరాలుగా వేళ్ళు పాతుకపోయిన వ్యాపారం మనస్తత్వముకల్గిన ట్రేడ్‌యూనియన్స్‌కు వ్యతిరేకంగా, బ్రిటిష్ కాలంనాటి కార్మిక వ్యతిరేక పల్లపట్టాలకు వ్యతిరేకంగా యెంతో సాహసంతో పోరాడిన మీఅందరికి నా విప్లవాభినందనాలు."

ఒక్కక్షణం అందరిని పరీక్షగా చూసాడు. దూరంగా ఉన్నవాళ్ళంతా దగ్గర దగ్గరగావచ్చి కూచున్నారు. గుడిసెలముందున్న ఆడవారు, పిల్లలు నిశ్శబ్దంగా మౌనంగా వింటున్నారని కనిపెట్టి మళ్ళీ తన ఉపన్యాసాన్ని కొనసాగించాడు.

"ఎటువంటి పరిస్థితిలో మన మీ సుదీర్ఘమైన సమ్మె పోరాటాన్ని చేపట్టామో మీకు మరోసారి గుర్తుచేయదలిచాను. సుమారుగా ముప్పయిసలభై ఏండ్ల నుంచి మురికి కూపాల్లాంటి గుడిసెల్లో, తాగేందుకు మంచినీళ్ళు, పీల్చేందుకు మంచిగాలి అయినాలేక ఒకపూట తింటె మరోపూట లేకుండా, మన గుడిసెలనుండి ఎంతో దూరంగాఉన్న బావుల్లోకి చీకట్లో పనిలోకి బయలుదేరినోల్లం. మళ్ళీ పెండ్లాంపిల్లలను ఆరోజు చూస్తామోలేదో అన్నబెంగతో మైళ్ళకొద్ది నడిచిపోయి చీకటి గుహల్లాంటి బొగ్గుబావుల్లో మననెత్తురంతా ఒడిపి దినమొకగండంగా బ్రతుకులు వెల్లబుచ్చుతున్నాము."

అవునన్నట్లుగా ముందున్నవాళ్ళంతా తలలు ఊపారు.

"మనమెంత కష్టపడ్డాగాని, ఎన్నిఏండ్లు గడిచినాగాని మన బతుకులో ఎదుగు బొదుగులేకుండా ఉంది. మన రాతిట్లాకాలబడ్డదని సర్దుకపోయి బ్రతుకుదామన్నా

సర్దుకపోలేకుండా ఉంది, నడిచేఎద్దునే ముల్లుతో పొడిచిన తంతుగా ఉంది మన జీవితం. మన పిల్లలకు బళ్ళులేవు, మనకు రోగాలువస్తే చావాల్సిందేతప్ప మందులు దొరకవు, మనకు ఇండ్లులేవు, మన ఆడోళ్ళు నీళ్ళకొరకు రోజూపోట్లాడుకోక తప్పదు, చివరకు పొయిరాజేసు కోవటానికి యింత బొగ్గుదొరకటం కూడ కష్టమైపోయింది. మనల్ని పట్టించుకునే నాధుడులేడు, ఇప్పుడున్న యూనియన్ వాళ్ళు మనల్ని అడ్డుగాపెట్టుకొని మేనేజ్‌మెంట్‌తో వ్యాపారంచేస్తూ లక్షలు ఆర్జించుకొన్నారు. కల్లబొల్లి మాటలతో మనల్ని ఎప్పటికప్పుడు మోసముచేస్తూపబ్బం గడుపుకొంటున్నారు."

రాడికల్స్ వాళ్ళు వీధిలో మీటింగ్ పెట్టారనితెల్సి పక్కవాడలోనుండి అప్పుడే వచ్చిన కార్మికులు కొందరు దగ్గర దగ్గరగావచ్చి కూచున్నారు.

"మేనేజ్‌మెంట్‌కు మన రక్తం ఎలా పిండుకోవాలో తెల్సుగాని మన మెలా బతుకుతున్నామో అవసరంలేదు. మనలో చాలమందిమి ఈ చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చినవాళ్ళమే. గ్రామాల్లో మన బతుకులుసాగక, ఆరుగాలం కష్టపడ్డాగాని కాలేకడుపునిండక, సావోబతుకోపోయి అబాయిల్నేచద్దామని బాయిపనికివచ్చినోల్లమే. యిక్కడికివస్తే మనబతుకులు బాగుపడ్తయి, పెండ్లాం పిల్లలకు యింత తిండిదొరుకుద్ది అన్న ఆశకొద్దీ కొంపాగోడూ, భూమీపుట్రా అమ్ముకొని యిక్కడ యూనియన్ వాల్లకు లంచాలిచ్చి బాయిపనికి వచ్చినోల్లమే"

గా మాటల మధ్య బక్క ఎంకులులేచి

"ఆక్కడికొచ్చి ఏం బాపుకున్నం అక్కడెట్లున్నదో యిక్కడ గట్లనే ఉన్నది. అక్కడ భూమిదొరలు సాగనిత్తలేరు. యిక్కడికొస్తే బాయి దొరలు సాగనిత్తలేరు. ఎక్కడికిపోయినా ఒక్కతీర్గనె ఉన్నది" బిగ్గరగా అన్నడు

రాయమల్లుకాస్తఆగి ఎంకులు మాటని మళ్ళీ చెప్పుకొచ్చిండు. "గా అన్న చెప్పినట్టు గ్రామాల్లో భూస్వాములకు ఎదురునిల్వలేక, బతుకుసాగక మనమెన్ని బాదలు పడ్డామో యిక్కడ అంతకు రెట్టింపుగానే ఉన్నయి. గ్రామాల్లో తినేందుకు తిండి లేకున్న తాగేందుకు యిన్నిమంచినీళ్ళయినా దొరికేవి, పీల్చుకునేందుకు యింత మంచి గాలి అయినా దొరికేది, యిక్కడ తిండేమోగాని తాగేందుకునీళ్ళు దొరకవు, ఒకపూట నల్లవస్తె మరోపూటరాదు, గుదిగుచ్చినట్టుండే మనగుడిసెల్లో బొగ్గుగాలికి ఊపిరిసరిగా ఆడక దగ్గుదమ్ముతో మన ఊపిరితిత్తులు గుల్లయిపోతానయి.... ఏనుగులాంటోళ్ళు పీనుగలైపోతాండ్లు. బయటపరిస్థితి ఈ విధంగా ఉంటే బాయిల పరిస్థితి మరీ అధ్వా

న్నంగా ఉంది. ఏరోజు కారోజు యింటికి తిరిగొస్తామన్న నమ్మకంలేదు. చీకటి పొక్కలటువంటి బొగ్గుబాయిల మైళ్ళకొద్దినడిచిపోయి భూదేవితో భూమి పొరలమధ్య మన రక్తమంతా నీళ్ళుచేసుకొని బొగ్గుబయిటికి తీసుకొస్తం; బాయిలో దాహమేస్తే యిన్ని మంచినీళ్ళు దొరకవు, గాలిసరిగాలేక గర్మిలో ఊపిరిఆడక విలవిల్లాడి అయాస మొచ్చి కూలబడిపోతే మేనేజరు దొరొచ్చి 'వనెందుకు ఆపినవంటడు'గాని మన బాధేందోవాడికి అవసరంలేదు." ఒకక్షణ మాగిండు, అంతలోకే

'ఆ లంజకొడుకులకేమనవసరం? ఏందో గాలిపిట్టోలెవచ్చి చూసిపోయెటోళ్ళ-మనమెట్లాసత్తేంది? వానిబతుకు బలేసాగుద్దాయే. కంపినికట్టించిన లంకంతయిండ్లు, ఎటుజంటెఅటు పోయేందుకుకార్లు పెండ్లాంపిల్లలతో ఆయిగుంటడు' బొక్కనోరు ముసలి కార్మికుడు లొడలొడవాగిండు.

"గంతేనా యింటికాడెంతమంది పనోల్లుండాలే? బాయికాడ మస్టరేయించి రోజు కొక్కన్ని పంపుతడు పొల్లగాల్లనెత్తుకునేందుకు, పూలచెట్లు బాగుచేసేందుకు కూర గాయలు తెచ్చేందుకు, సర్వంచేయించుకునేందుకు పనిమనసులుకావాలె, పనిమనసులు" అసహనంగా గొణిగిండు యింకోకార్మికుడు.

"కాస్తాగుండ్లి, మీమాటలేనా చెప్పేదేదో పూర్తిగా చెప్పనీయరా?" గుబురుగా పెరిగిన గడ్డాన్ని గోక్కుంటన్నడు వెనకనిలబడ్డతను.

కార్మికులమాటలు సద్దుమణిగాక రాయమల్లు మళ్ళీ మొదలెట్టాడు.

"కంపినిదొరల బ్రితుకులు బలేగాసాగుతుంటే, చివరికి ఉత్పత్తి పెంచేందుకు ఉపయోగపడే చమ్మాసులు, తట్టలు ఖాళీటబ్బుల సప్లయి సరిగాచేయాలిఅని సమ్మె కట్టాల్సిన అధ్వాన్నస్థితికి మనల్నినెట్టి, నిర్లక్ష్యంగా, విలాసవంతంగా గడుపుతుండ టమే గాకుండా అక్రమలాభార్జనకు కంట్రాక్టర్లతో లాలూచీ, బొగ్గుఅమ్మకంలో లంచాలు అపాయింటుమెంటులో లంచాలుమేసి తెగబలిసిపోయి ఉన్నరు."

"అవును లంజకొడుకులకు కొవ్వురాలొచ్చినయి. ఎవని కండ్లగుపిస్తలేవు-కండ్లకు కొవ్వువచ్చింది" మంది మధ్యలో మరెవ్వడోఅన్నడు.

రాయమల్లు మళ్ళీ కొనసాగించాడు "మనబతుకు బాగుపడ్తదని, ఐక్యంగాఉండి మనమొక యూనియన్ పెట్టుకున్నాము- ఆ యూనియన్ల మనతోటి పనిచేసెటోల్లను యూనియన్లకు నాయకులుగా పెట్టుకున్నాము- మనలాగా కార్మికులుగా బతుకుదామని కంపిన్లకువచ్చినోళ్ళే- కానివాళ్ళు మనబతుకులే బాగుచేసిండ్లో వాళ్ళబతుకులే బాగు

చేసుకున్నరో చూడుండ్లి, యూనియన్ నాయకులకు గీ కార్లెట్లా వచ్చినాయో, బంగ్లాల మీద బంగ్లాలెట్లా కట్టిండ్లో? మనల్ని ఉద్ధరించేనా? మనల్ని అడ్డుగాపెట్టుకొని మేనేజి మెంటుతో లాలూచీపడి సంపాదించినవికావా ఈ ఆస్తులన్ని?" అడిగాడు కార్మికుల నుద్దేశించి.

'అంతే లంజకొడుకులు అట్లనె సంపాదించిండ్లు- ఏపనికావాలన్నా లంచాలే మింగుడాయె- యింక సంపాదించకుంటె ఏంజేత్తరు' ఒక కార్మికుడు.

"అచ్చంగా అట్లనె సంపాదించిండ్లు అపాయింటుమెంటులో లంచాలు, ఫలానా పనిచేసిపెడ్తే ఫలానా రేటుగా లంచాలు వసూలుచేసిందిచాలక, జీతాలకు, బోనసులకు చందాలు వసూలుచేసుకొని బొంచేస్తాండ్లు.... యిన్నాల్లు మవునంగా మనం భరించాము- యిన్నాల్లు మనల్ని అజ్ఞానంలోఉంచిండ్లు- మన హక్కులేవో బాధ్యతలేవో తెలువ కుండా చేసిండ్లు, చివరికి న్యాయమైన లీవుకోసంకూడ మేనేజర్ను కల్సుకోవటానికి భయపడెటట్టు చేసిండ్లు- ఆవిధంగా మన అజ్ఞానాన్ని ఆసరగాచేసుకొని డబ్బులు సంపాదించిండ్లు.

రాయమల్లు ఒక్కక్షణం మౌనంగా పరీక్షించి ఉపన్యాసాన్ని కొనసాగించాడు.

"బాయిలో పరిస్థితులు రోజు రోజుకు మెరుగుపడకపోగా యింకా అధ్వాన్నమై పోతున్నాయి- మేనేజ్‌మెంట్ రోజు రోజుకు మనమీద పనిభారంపెంచి మన రక్తాన్నింకా పిండుకోచూస్తున్నది.

ఈ పరిస్థితి మన సింగరేణిలోనే కాదు దేశవ్యాప్తంగా ఉన్నది, రెక్కలుముక్కలు చేసుకొనేవానికి రోజురోజుకు తిండికరువైపోతున్నది. మన చుట్టుపక్కల పరిస్థితి యిందుకు ఏమాత్రం భిన్నంగా లేదు. గ్రామాల్లో పరిస్థితి మునుపటిలాలేదు, దొర లకు అణిగిమణిగుండేందుకు రైతుకూలీలు యిష్టపడటం లేదు, రైతుకూలి సంఘాలు పెట్టుకొని రాడికల్స్ నాయకత్వంలో దొరల దౌర్జన్యాన్ని ఎదిరిస్తున్నారు. యిదంతా మనం గ్రామాలకు వెళ్ళినప్పుడు చూస్తున్నదే. అయితే మన గ్రామాల్లో మనఅన్నలు తమ్ములు చేస్తున్నపోరాటం చూసి మనం ఉత్తేజితులం అయినాము. వాళ్ళలాగే మనం కూడ సంఘటితపడి మేనేజ్‌మెంట్ మనపై సాగిస్తున్న దోపిడిని, దౌర్జన్యాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధమై మన సమస్యల గురించి మనమే దొంగ ట్రేడ్ యూనియన్ల ప్రమేయం లేకుండా ఎప్పుడైతే పోరాటం మొదలుపెట్టామో అటు మేనేజ్‌మెంట్ ఇటు యూనియన్ వాళ్ళు గగ్గోలుపడి మన న్యాయమైన పోరాటాలను అణచ[illegible] కోసం

ట్రేడ్ యూనియన్లు, మేనేజ్‌మెంట్ రెండూ కుమ్మక్కయి రెండు సంవత్సరాలవరకు ఎటువంటి సమ్మెలు చేయమని, సమ్మెచేసే కార్మికులకు మద్దతుయివ్వమని కార్మిక చరిత్రలోనే అసహ్యకరమైన కార్మిక వ్యతిరేక ఒప్పందం కార్మికులమైన మన ప్రమేయం లేకుండానే AITUC, INTUC నాయకులు చేసుకొని తీరని ద్రోహం చేసారు."

ట్రేడ్ యూనియన్‌లో తిరిగే చలమయ్య ఏదో మాట్లాడుదామని నోరిప్పినోడు మళ్ళెందుకో సర్దుకొనికూచొని చెవులురిక్కించి యింటాండు.

"అయితే ఒక విషయం స్పష్టమైంది. యింతవరకు మేనేజ్‌మెంట్‌కు వ్యతిరేకంగా పోరాడాలి, మేనేజ్‌మెంట్ లంగలు దొంగలు అని తిడ్తున్న యూనియన్ నాయకులు ఎప్పుడైతే మనం నిజంగా పోరాటం చేయడం మొదలుపెట్టామో అప్పుడు వాళ్ళ గుండెలు అగిసంతపనయిపోయి కార్మికులు చెడిపోయిండ్లు. ఎవనిమాట యింట లేరు అంతా నక్సలైట్లయి పోయిండ్లని తిడ్తాండ్లు. యిదంతా చూస్తుంటే నాకోకథగుర్తుకొస్తాంది. ఎనకటికి ఓ రాజకుమారుడు రాక్షసితోని కొట్లాడుతానని ఎన్నోనేర్చుకున్నాడట. తీరా రాక్షసివచ్చేటాల్లకు గుండాగిసచ్చిండట. అన్నట్లున్నది యూనియన్ వాళ్ళతంతు ... యింతవరకు ముసుగులో గుద్దులాటలాగున్న యూనియన్ విద్రోహం ఈ ఒప్పందంద్వారా మనకు స్పష్టమైంది. రెండోవైపు మేనేజ్‌మెంట్ యూనియన్ వాళ్ళను విదిలిపుచ్చి న్యాయమైన పోరాటాలను అణచడంకోసం బ్రిటిష్‌కాలంనాటి నల్లచట్టాలను మస్టర్ల కోతచట్టాలను కార్మికులపైరుద్ది అణచచూస్తున్నది. అందులో బాగంగానే KK2 బావిలోపనిచేసే కార్మికున్ని నిర్బంధంగా 'మెడికల్‌ఫిట్' చేయుడాన్ని వ్యతిరేకిస్తూ మనంజరిపిన ఒక్కరోజుసమ్మెను పురస్కరించుకొని KK2 కార్మికులమీద ఎనిమిది మస్టర్ల కోతచట్టాన్ని అమలు జరుపచూసింది".

"రాడికల్స్ నాయకత్వంలో మస్టర్ల కోతచట్టానికి వ్యతిరేకంగా పోరాటం మొదలుపెట్టాం. అయితే మేనేజ్‌మెంట్ మిగతాబావుల కార్మికులనుండి KK2 బావి కార్మికులను వేరుచేసి ముందుగా ఏదో ఒకబావిమీద కోతచట్టాన్ని అమలుజరపాలని చూసింది. కానిమనం మందమర్రి డివిజన్‌లోని కార్మికులనేకాకుండా, రామకృష్ణాపురం గోదావరిఖని కార్మికులను 30 వేలమందిని మనం పోరాటక్రమంలో ఏర్పరుచుకున్న విప్లవకర ట్రేడ్‌యూనియన్ అయిన, సింగరేణి కార్మికసమాఖ్య నాయకత్వంలో మస్టర్ల కోతచట్టానికి వ్యతిరేకంగా సమ్మెలోకి తీసుకరాగలిగాం"

రాయమల్లు మాటలమధ్యలోనే ఓ కార్మికుడులేచి ఆవేశంగా 'దాంతో యూనియన్ వాళ్ళు తమఆటలింక సాగయిఅనుకొని బాయిబాయికి, వాడవాడల మీటింగ్‌పెట్టి బాయిలదిగుండ్లీ, మీరు బాయిలదిగుతే మేముకొట్లాడి కోతచట్టాన్ని తీసేయిత్తం అని చెవులిల్లుకట్టుకొని చెప్పిండ్లు- యింకోలీడరోడు గీ చట్టమే తీసెయ్యరు. చట్టంపోవాలంటే పార్లమెంట్లపెట్టి కొట్లాడాలనె, పరోడు రాజ్యం మాచేతుల్లోకివస్తే చట్టం తీసెత్తం ఎన్నికలొచ్చినప్పుడు మాకు ఓట్లుఏయండి అనిచెప్పె- యింకొకడు సుప్రీం కోర్టులబెట్టి కొట్లాడాలనె- అందరు దొంగమాటలే చెప్పిరి. అసలుసంగతి ఎవడు చెప్పకపాయె యూనియనోల్ల కొట్లాటలెటువంటియో మనం చూసి చూసి నిరిబడ్డం' అని ముసలికార్మికుడు ముక్కిరిసిండు.

"బాయి దొరలుకూడ యూనియనోవితీర్గ బాయిలమీద ఉపన్యాసాలిచ్చిరి. మంద మర్రి బాయిలోల్ల మీద చట్టంగాని మీమీద లేదుకదా అని రామక్రిష్ణపురం కార్మికులకు చెప్పిరి. అక్కడ దిగుతాండ్లని యిక్కడ, యిక్కడ దిగుతాండ్లని అక్కడ మాయ మాటలు చెప్పిరి" రామక్రిష్టాపురం కార్మికుడన్నడు.

కార్మికులమాటలు ముగిసాక రాయమల్లు మళ్ళీతన ఉపన్యాసాన్ని కొనసాగించాడు.

"ఎప్పుడైతే అటు మేనేజ్‌మెంట్, ఇటు యూనియన్లు సమ్మె విరమింపచేయడంలో విఫలమయ్యారో, ఎప్పుడైతే మన సమ్మెవల్ల బొగ్గు కొరతఏర్పడి విద్యుత్ కేంద్రాలు ఆగిపోయాయో, రైల్లు నడవకుండాఅయి సంక్షోభం ఏర్పడిందో. అప్పుడు అంజయ్య ప్రభుత్వం కల్లబొల్లి మాటలు చెప్పుతూ రంగంలోకి దిగింది.... 'అసలు కార్మికులకు సమస్యలే లేవని, యిదంతా తీవ్రవాదులు చేస్తున్నకుట్ర అని ప్రకటనలు చేసాడు' క్రూరమైన నిర్బంధాన్ని అమలుజరిపి వందల సంఖ్యలో అరెస్టులు చేసిండ్లు. పోలీసోల్లకు మైకులిచ్చి "రాడికలోల్లు బెదిరిస్తే మేమున్నాము. మీరు బాయిలదిగుండ్లి" అని వాడవాడల చాటింపులు చేసిండ్లు- బాయిలకాడ పోలీసు బందోబస్తులుచేసిండ్లు.... బలవంతంగా కార్మికులను బావుల్లోకి దించెటందుకు ప్రయత్నించిండ్లు 'కాని కార్మికులు మేం "ఎవరి బెదిరింపులకు భయపడి బాయిల దిగకుండా ఆగుతలేము. మాకు సమస్యలున్నాయి. మా సమస్యల పరిష్కారం కోసం మేం సమ్మెచేస్తున్నాం. మేం బావిలో దిగాలంటే మా సమస్యలు పరిష్కారం కావల్సిందే" నని గట్టిగా చెప్పారు. దాంతో యింకా అరెస్టులు ఎక్కువ చేసారు. రాత్రికి రాత్రి అరెస్టులుచేసి, చిత్రహింసలకు గురిచేసి సింగరేణి కార్మిక సమాఖ్య నాయకులను అరెస్టుచేయాలని చూసారు. అయితే పాశవిక నిర్బంధానికి ఏమాత్రం వెనుకంజవేయకుండా మనం పట్టుదలతో రెండునెలల వరకు కొనసాగించాం."

అందరు మౌనంగా వింటున్నారు.

"చివరికి ఎటువెగలేక మన సంఘటిత శక్తిముందు ప్రభుత్వం తలవంచక తప్పలేదు. సింగరేణి కార్మిక సమాఖ్య ఏర్పాటుచేసిన ప్రతినిధులతో కార్మికసమస్యలను ఒప్పుకుంటు ఒప్పందం చేసుకోవటం యిష్టంలేక, కార్మికుల్లో సింగరేణి కార్మిక సమాఖ్య పలుకుబడి యింకా పెరిగిపోతుందనే కుట్రతో మన సమ్మెను మొదటినుండి వ్యతిరేకిస్తున్న యూనియన్ నాయకులతో మన సమస్యలను ఒప్పుకుంటు చరిత్రలోనే పరిహాసపదమైన ఒప్పందము చేసుకొన్నది."

"యింకా నలుగొద్దులాగుతే మనతోటే ఒప్పందము చేసుకునెటోల్లు. యిప్పుడు యూనియనోల్లు మేమే సాధించుకొచ్చినమని సిగ్గిడిచి చెపుతాండ్లు అట్లా కాకుండా అయ్యేది" యువకార్మికుడొకడు మందిలకెల్లి అన్నడు.

రాయమల్లు "కాని కామ్రేడ్స్! సుదీర్ఘమైన రెండునెలల పోరాట కాలంలో మన కార్మికులు పడ్డకష్టాలవల్ల చివరికి కోతచట్టాన్ని తీసేసారని తప్ప ఈ యూనియనోళ్ళు కొట్లాడి తీసెసారన్న భ్రమలు ఎవరికి లేవు. అయితే ఈ ఒక్క పోరాటంతోనే మన కష్టాలన్ని దూరమయ్యాయని కూడ మనం అనుకోవద్దు- కార్మికులను అణచటం కోసం 'సమ్మె నిషేధపు చట్టాలింకా' తయారుచేస్తున్నది ఈ ప్రభుత్వము అయితే ఈ పోరాటం మనం ముందు ముందు జరుపబోయే పోరాటాలకు తర్ఫీదు మాత్రమే అన్న సంగతి మరిచిపోరానిది.

అయితే ఈ పోరాటంలో మన విజయం ఏమిటి? అని ప్రశ్నించుకొంటె పోరాటంలేకుండా మన బతుకులు మారబోవని మలోసారి స్పష్టమైంది, యింతవరకు మన శక్తి ఏమిటో మనకింతవరకు తెలియలేదు.... మనం సంఘటితంగా పోరాడితే ఈ ప్రభుత్వాన్ని మెడలు వంచగలమన్నది మనకీసమ్మెద్వార తెలిసిపోయింది.... అంతేకాదు మన శత్రువులెవరో మిత్రులెవరోకూడ తెల్సిపోయింది- ఇంతవరకు మేనేజ్‌మెంట్‌కి వ్యతిరేకమనుకున్న మనపోరాటం ఒక్క మేనేజ్‌మెంట్‌కేకాదు, దానికి ప్రాతినిధ్యంవహిస్తున్న ప్రభుత్వానికి, యిటు రివిజనిస్టు ట్రేడ్‌యూనియన్లకు కూడా వ్యతిరేకమే అన్నవిషయం స్పష్టమైంది.... అంతిమంగా కార్మికరాజ్యం వచ్చేంతవరకు మనపోరాటం కొనసాగుతూనే ఉంటుంది".

రాయమల్లు చివరిమాటలింకా ముగించకముందే అక్కడ కూచున్న కార్మికుల్లో కలకలం బయలుదేరింది ఎవరో ఉరుక్కొచ్చి 'పోలీసు లత్తాండ్లు' అని అరిచిండు.

పుస్తకపరిచయం :

## రక్తాశ్రువులు

డాక్టర్ నార్మన్ బెతూన్ అంటే ప్రపంచపు పశ్చిమదిశనుండి తూర్పుదిశవరకు పరచుకున్న ఒక మహాశక్తి. పేదప్రజలకు వైద్యసహాయం అందించాలనే తహతహకు, ప్రజారోగ్యం ప్రభుత్వబాధ్యతగా ఉండాలనే ఆశయానికి, యుద్ధరంగంలోకి నేరుగావెళ్ళి క్షతగాత్రులకు రక్తంఎక్కించాలనే సాహసానికి, సామ్రాజ్యవాదానికి, ఫాసిజానికి వ్యతిరేకంగా పీడితజాతిచేసే పోరాటంలో గాయపడ్డవాళ్ళకు నిరంతరాయంగా వైద్యసహాయం అందించడంలో తన జీవితాన్నే బలిపెట్టిన త్యాగానికి ఆ పేరు ఒక సంకేతం. బెతూన్‌స్మృతి ఉత్తేజాన్ని కలిగిస్తుంది- పోరాటాన్ని చేయిస్తుంది.

బెతూన్‌జీవితం నాలుగుదశల్లో కనిపిస్తుంది- ఒక ఆశయంతో ముందుకుసాగిన జీవితప్రస్థానంలో ఈ నాలుగుదశలు నాలుగుమెట్లు- ఒక్కొక్కమెట్టును అధిగమించడంలో ఆ ఆశయం మరింత స్పష్టమై, కారణాలుతెలిసి, నిబద్ధతపెరిగి, చివరకు పీడితప్రజల విముక్తి పోరాటంలో తనఆశయాన్నీ, జీవితాన్నీ అంతర్భాగాలుగా, చేసుకోవడం కనిపిస్తుంది- బెతూన్ ఆశయమేకాదు, సామాన్యప్రజలకు మేలుచేసే ఏ ఆశయమైనా దానంతట అదినెరవేరదు- ప్రపంచ వ్యాప్తంగా సామ్రాజ్యవాదం, నియంతృత్వం తొలగిపోయి, పీడితప్రజానీకం విముక్తంకావడంలో దానిసాఫల్యం ఉంటుంది.

డాక్టర్లు, మతాచార్యులుఉన్న ఒక సాంప్రదాయిక కుటుంబంలో నార్మన్ బెతూన్ 1890లో జన్మిస్తాడు- సనాతన తత్వవ్యతిరేకి, శాస్త్రజిజ్ఞాసువు అయిన తాత

---

అంతలోకే పోలీసువ్యానును కార్మికుల గుడిసెలకావలఉన్న రోడ్డుప్రక్క చెట్టు నీడలో ఆపుకొని బిలబిలమంటూ పోలీసులు బూట్లు, లాటీలచప్పుడు చేసుకుంటూ గుడిసెలముందుకొచ్చి ఆగిండ్లు- గుడిగుచ్చినట్లున్న కార్మికులగుడిసెల్లో ఒక్కరుతప్ప జంటగా వెల్లటానికి వీలులేకుండాఉన్న యిరుకైనసందులగుండా ముందుకెళ్ళాలంటే భయంతోఆగిన జవాన్లను వెనకనుండి "ముందుకు నడువు"మంటు ఆర్డరు జారిచేసి సర్కిలు ఇన్‌స్పెక్టర్, ఇద్దరు సబ్-ఇన్‌స్పెక్టర్లతో వెనకనడిచి యిరుకు సందులగుండా లోనికొచ్చారు.

కాని కొద్దిక్షణాలకింద జనంతో కిటకిటలాడిన వీధిలో, చీకటిరాజ్యమేలుతున్నది ... వీధులు నిర్మానుష్యమైనాయి- వీధికుక్కలు పోలీసులకేసి అదేపనిగా మొరుగుతున్నాయి.

(సమ్మె అయితే ముగిసింది కాని పోరాటమింకా కొనసాగుతూనేఉన్నది.)